క్లుప్తంగా

28న జాషువా జయంతి సందర్భంగా కవి సమ్మేళనం

నందిగామ: మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఈనెల 28 వ తేదీన నందిగామలో కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు గుర్రం జాషువా కళా పీఠం అధ్యక్షుడు కోట శామ్యూల్ రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సమైక్యత–మత సామరస్యం అనే అంశాలపై కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కవి సమ్మేళనం అనంతరం ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఈనెల 25 వ తేదీలోగా 9440677715 నంబరులో సంప్రదించాలన్నారు.

అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు

నందిగామ: డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్‌లు అమలులో ఉన్నాయని, అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా చర్యలు తప్పవని ఏసీపీ జనార్దన్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల లాంటి వాటికి అనుమతులు లేవన్నారు. విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొని భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. సమావేశంలో సీఐ హనీష్ పాల్గొన్నారు.

కేతవీరునిపాడు మాజీ సర్పంచ్ మృతి



నందిగామ:మండలంలోని కేతవీరునిపాడు గ్రామ మాజీ సర్పంచ్ మల్లెంపాటి శేషగిరిరావు (86) మంగళవారం మృతి చెందారు. ఆయన అభీష్టం మేరకు మృతదేహాన్ని బుధవారం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

29న విజయవాడలో మహా ధర్నా

జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 29న విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి పిలుపు నిచ్చారు. పట్టణంలో మంగళవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళిత రక్షణ యాత్ర కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట, మండలంలోని బలుసుపాడు, అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, మల్కాపురం, తిరుమలగిరి గ్రామాల్లో బైక్ యాత్ర నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కృష్ణ, జుజ్జువరపు వెంకట్రావు, ఆదిమళ్ల అబ్రహాం, పెద్దపాంగు సిల్వారాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదోలైన్‌లో పర్యావరణ గణపతి వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను అలరించింది. గాయకులు ఆలపించిన సినీ భక్తి గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను రంజింప చేసింది.

బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీ ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు అట్కిన్సన్ (గొల్లపూడి) పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.రిషిత సాగర్ ఎంపికైంది. ఈ నెల 16న నూజివీడులోని బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన బాలబాలికల ఎంపికలో అండర్–14 బాలికల విభాగంలో రిషిత సాగర్ కనబరిచిన ప్రతిభతో పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ ఎస్.సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున పాల్గొనేందుకు ఈ ఎంపికలు జరిగాయిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అట్కిన్సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమ పావని రిషిత సాగర్‌ను అభినందించారు.

మధురంగా సాగిన దాస పదామృతం

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం నిర్వహించిన దాస పదామృత కార్యక్రమం సంగీత వైభవాన్ని చాటింది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ వాగ్గేయకారులు, భక్తి తత్వవేత్తలు త్యాగరాజ స్వామి కీర్తన గిరిరాజ సుత, తూము నరసింహ దాసు లేరానాసామి, పరాకుంశదాసు శ్రీరాముల, బొమ్మరాజు సీతారామదాసు భక్తి భిక్షాందేహి, మన్నెకొండ హనుమదాసు, పరమాత్మ, పురందరదాసు కలియుగదల్లి, రామదాసు తక్కువేమి మనకు తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, వీణపై శశిధర్, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై కేవీ కిషోర్ సహకరించారు. లంకతేజస్వి భక్త దాసుల కీర్తనల వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్. పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.



శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో ఆలయ చైర్మన్, పాలకవర్గ సభ్యులు



ముక్కపేట గాంధీజీ కళావేదిక వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం



పెద్దాపురంలో గణనాథునికి పూజలు చేస్తున్న ఎంపీపీ దంపతులు



పేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఉదయభాను పూజలు

గణనాథునికి ఘనంగా పూజలు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని సోమవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. విఘ్నాలు తొలగించే గణనాథుని కొలుచుకుంటే సర్వ శుభాలు జరుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకు అనుగుణంగానే ఆయనకు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలో పలు మండపాల్లో జరిగిన పూజా కార్యక్రమాలకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హాజరయ్యారు. పట్టణంలోని ముక్కోటి మహా మండపం వద్ద అందమైన పర్యావరణ హిత మట్టి గణపతిని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. దీంతో పాటు కైలాసంలో ప్రత్యేకంగా బాల గణపతికి పార్వతీ మాత స్నానం చేయిస్తున్నట్లుగా ఏర్పాటు చేసిన మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల పురాతన గణపతి ఆలయంలో చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వాసవి మార్కెట్, గాంధీ సెంటర్, టీటీడీ కల్యాణ మండపం రోడ్, కూరగాయల మార్కెట్, మెయిన్ బజార్, పాత బస్టాండ్ లలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటితోపాటు పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథులకు పూజలు నిర్వహిస్తున్నారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: వినాయక చవితి పర్వదినాన్ని సోమవారం మండలంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో మట్టి గణనాథునికి నవ రాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు గణపతి హోమం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలక వర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, ఎం.పద్మ, కర్ల వెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు, ఆలయ వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. గ్రామంలో పలుచోట్ల ప్రజలు పోటా పోటీగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. మంగళవారం కూడా పందిళ్లలో భక్తుల సందడి కనిపించింది. పలు పందిళ్లలో దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు.



నందిగామ పట్టణంలోని ముక్కోటి మండపంలో పూజలందుకుంటున్న మట్టి గణపతి విగ్రహం



నందిగామ వాసవి మార్కెట్లో పూజలందుకుంటున్న భారీ గణనాథుడి విగ్రహం

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానదీ తీరంలో గణేష్ నిమజ్జనానికి వచ్చేవారు పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు అన్నారు. గ్రామంలోని కృష్ణానదిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నది వద్ద గజ ఈతగాళ్లతో పాటు పోలీస్ సిబ్బంది, ప్రత్యేక పంటును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ జానకిరామ్, ఎస్ఐ కృష్ణబాబు పాల్గొన్నారు.



వేదాద్రి వద్ద కృష్ణానదిని పరిశీలిస్తున్న ఏసీపీ జనార్దన్

వత్సవాయిలో...

వత్సవాయి: గణపతి నవరాత్రులు సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వత్సవాయి. దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు గ్రామాల్లో భక్తులు అధికసంఖ్యలో విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. మంగళవారం రెండవ రోజు కూడా పూజలు కొనసాగాయి.

కంచికచర్లలో...

కంచికచర్ల: వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చలువ పందిళ్లు వేసి గణేషుని ఉత్సవ విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. కంచికచర్లలోని నెహ్రూబొమ్మ సెంటర్, పెట్రోలు బంక్ సెంటర్, పశువుల ఆసుపత్రి రోడ్డు, నన్నపనేని బజార్, తీగెల బజార్, రామాలయం పెద్ద బజార్, హనుమాన్‌పేట, పోలీస్ స్టేషన్ సెంటర్, వసంతకాలనీ, మోడల్ కాలనీ, ప్రణీత కాలనీ తదితర ప్రాంతాల్లో కమిటీ సభ్యులు పందిళ్లు వేసి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కీసరలో శ్రీ శివ శంకర శివాలయం, ఆంజనేయస్వామి, వినాయకుని ఆలయాల్లో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. మండలంలోని మున్నలూరు, కునికెనపాడు పరిటాల, గండేపల్లిలో వినాయకుని ఉత్సవ విగ్రహాలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, డి.గురవయ్య, పూర్ణచంద్రరావు, దాసరి రాము, రాంబాబు, లగడపాటి నాగేశ్వరరావు, సర్పంచి వేల్పుల సునీత, వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి తదితరులు విశేష పూజలు చేశారు.

వీరులపాడులో...

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి గణనాథులను ఏర్పాటు చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ఎంపీపీ కోటేరు లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పేటలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: వినాయక చవితి వేడుకలు పట్టణంలో సోమవారం వివిధ ఉత్సవ కమిటీలు, పలు సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా ఏర్పాటుచేసిన గణేష్ మండపాలలో వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలోని మంగలి బజారు, మిట్టగూడెం, చెన్నకేశవస్వామి బజారు తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లోని గణనాథులను టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏకదంతా నమోస్తుతే..

జగ్గయ్యపేట: మండలంలో వినాయక చవితి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథుని మంటపాలు ఏర్పాటుచేసి దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. చిల్లకల్లు రామస్వామి నగర్‌లో మంటపం ఏర్పాటు చేసి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ముక్త్యాల జెండా చెట్టు బజారులోని వినాయక విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. బలుసుపాడులోని గురుధాం ఆశ్రమంలో గెంటేల వెంకట రమణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రామ్‌కో, కేసీపీ కర్మాగారాలలోని విగ్రహాలకు కార్మికులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ బజారులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలోని మండపంలో పూజలు

పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపంలోని విగ్రహాన్ని ఎమ్మెల్యే ఉదయభాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నాయకులు అంజనీప్రసాద్, గోపి, శేషం ప్రసాద్, మోరె వినోద్, శ్రీనివాస బ్రహ్మం, విజయ భాస్కర్, బుజ్జి, రాధాకృష్ణ, బాలకోటి, నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని గ్రామోత్సవం

నందిగామ: పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల పురాతన గణపతి ఆలయంలో వినాయక చవితిని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకలలో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణపతి స్వామివారిని పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశంలోనే ఆదర్శ పాలన

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే ఆదర్శమంతమైన పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. కుల మతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. పట్టణంలోని 11 వ సచివాలయం పరిధిలోని 24 వ వార్డు కర్లబజారు, మిట్టగూడెం ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఉదయభాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల కాలం నుంచి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వారికి వివరించారు. అర్హత మేరకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా అని మహిళలతో ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కర్లబజారులో నూతన డ్రెయిన్ కావాలని స్థానికులు కోరగా, నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. వీధిలైట్లు ఏర్పాటుచేయాలని కోరగా వెంటనే ఏర్పాటుచేయాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ సాధుపాటి రాజు, పార్టీ మహిళ, ఎస్సీ, బీసీ విభాగాల అధ్యక్షులు ముసిని రాజ్యలక్ష్మి, బద్దూనాయక్, గుంజ లక్ష్మణ్, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మిట్టగూడెంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు పాల్గొన్నారు.

వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కారం

జగ్గయ్యపేటఅర్బన్: మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు పట్టణంలోని 6 వ వార్డులో పలు విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ సిబ్బంది పరిష్కరించారు. విద్యుత్ తీగలు తెగటంతో పలు వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేయడంతో చైర్మన్ ఆదేశానుసారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. మరమ్మతు పనులను మంగళవారం వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పర్యవేక్షించారు.

ప్రజల వద్దకే ప్రజా వ్యవస్థలు

గృహ సారథులు, బీఎల్‌ఏల సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నందిగామటౌన్: ప్రజల వద్దకే ప్రజా వ్యవస్థలను తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. చందర్లపాడు గ్రామంలోని తునికిపాటి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గృహ సారథులు, బీఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారని చెప్పారు.

గృహ సారథులు విజయ రథసారథులు

గృహ సారథులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ రథ సారథులని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ అన్నారు. ఓటరు జాబితాపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, డబుల్ ఎంట్రీ ఓట్లు, మృతి చెందిన వారు, స్థానికంగా నివాసం ఉండని వారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి తొలగించేలా చూడాలని తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకునిగా వచ్చిన తుమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, శాఖమూరి వెంకట కుమారి, పెమ్మసాని నరసింహారావు, రాయల జానకిరామయ్య, కొమ్మినేని మహేంద్ర, బుగ్గినేని సురేష్ పాల్గొన్నారు.



గృహసారథులు, బీఎల్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారం మేలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఎంతో సత్ఫలితాలనిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాహార పిండి వంటలను ఆయన పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ ఉమాదేవి, సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి, ఆయుష్ వైద్యురాలు వాణి, యోగా ట్రైనర్ లీలావతి, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ దుర్గమ్మ ఆలయ డైరెక్టర్ రవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు బజారు సాయి తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న విప్ ఉదయభాను

ఆంజనేయ రాజు కళారంగ సేవలు ఆదర్శనీయం

విజయవాడ కల్చరల్: సాహితీ సాంస్కృతిక రంగ ప్రముఖుడు బోడి ఆంజనేయరాజు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నవ కథావైతాళికుడు గురజాడ అప్పారావు వర్ధంతి, గణేష్ మహోత్సవాల ముగింపు సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం సినీ సంగీత విభావరి, మంగళవారం సాహితీవేత్త బోడి ఆంజనేయ రాజుకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఆంజనేయరాజు 30 ఏళ్లుగా నగరంలో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. న్యాయవాది హేమలత మాట్లాడుతూ ఆంజనేయరాజు ఇటీవల అమెరికాలో నిర్వహించిన తెలుగు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని పత్ర సమర్పణ చేసినట్లు చెప్పారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆంజనేయరాజు దంపతులను సత్కరించారు. గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, జయప్రభ, పావని, వడ్డాది కామేశ్వరి, షబానా గీతాలను ఆలపించారు. జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్, గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు, డాక్టర్ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన నలంద విద్యార్థులు


లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో ఈ నెల 17న జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. అండర్–12 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. అండర్–11 విభాగంలో ఐదో తరగతి విద్యార్థిని అల్వినా గోల్డ్ మెడల్ సాధించగా, అండర్–12 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి కోట చరిష్ బ్రాంజ్ మెడల్‌ను గెలుపొందాడు. విజేతలను మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలన్నారు. ఆత్మరక్షణ విద్యలు నేర్పడం ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుందన్నారు. విజేతలు ఢిల్లీ, హర్యానాలో జరగనున్న ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా సత్తా చాటి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.



జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మజ

ఎన్ఎస్పీ కెనాల్ వద్ద నక్షత్ర తాబేలు

గౌరవరం(జగ్గయ్యపేట): అటవీ ప్రాంతంలో ఉండాల్సిన తాబేలు గ్రామ సమీపంలోని పంట పొలం వద్ద రైతులకు సోమవారం దర్శనమిచ్చింది. వివరాలలోకి వెళితే ఎన్ఎస్పీ కెనాల్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్దనున్న పొలాల వద్ద అరుదైన తాబేలును రైతులు గమనించారు. వెంటనే గండ్రాయి ఫారెస్ట్ బీట్ అధికారి ప్రసన్న లీలాకు సమాచారం అందించటంతో తాబేలును పరిశీలించి నక్షత్ర తాబేలుగా గుర్తించారు. సమీపంలోని పోచంపల్లి ఫారెస్ట్‌లో విడిచిపెట్టినట్లు తెలిపారు.



నక్షత్ర ఆకారంలో ఉన్న తాబేలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com